జిల్లా జనసేనలో కలవరం

- మహిళను మోసగించిన కేసులో రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ మిడతాన
- ఉలిక్కిపడ్డ జిల్లా కార్యవర్గం.. ఫలించని రాజీ ప్రయత్నాలు



విశాలాంధ్ర - విజయనగరం: జిల్లాలోని ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న జనసేన పార్టీకి తీరని మచ్చ ఏర్పడింది. జిల్లాలోనే అగ్రగామిగా ఉన్న నేతపై ఓ మహిళను పెళ్ళి చేసుకుంటానని మోసగించిన కేసులో పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో జిల్లాలోని జనసేన క్యాడర్ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. కేసులో ఉన్న నేత రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ కావడం విశేషంగా చెప్పుకోవచ్చు.

వివరాల్లోకి వెళితే...

గంట్యాడ మండలంలోని రేగుబిల్లి గ్రామానికి చెందిన మిడతాన రవికుమార్ గత ఎన్నికల ముందు జనసేన జెండాతో వెలుగులోకి వచ్చాడు. విజయ నగరంతోపాటు గజపతినగరం నియోజకవర్గంలో భారీ ఫ్లెక్సీలతో అందరినీ ఆకర్షించాడు. ఎన్నికలలో టీడీపీతో పొత్తు ఆయనకు కలిసి వచ్చింది. అటు గజపతినగరంలోనూ, ఇటు విజయనగరంలోనూ టీడీపీ అభ్యర్థులు గెలవడంతో జనసేన ప్రాధాన్యతలో భాగంగా మిడతాన పేరు రాష్ట్ర స్థాయి అధిష్టానం దృష్టికి వెళ్ళింది. అతనికి కొందరి మద్దతు సైతం కలిసి రావడంతో నామినేటెడ్ రేసులో జనసేన కోటాలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి సైతం ఆ పార్టీ ఇచ్చి గౌరవించింది. ఇంత వరకు బాగానే ఉంది. కానీ మిడతాన రవికుమార్ వ్యక్తి గత జీవితం బట్టబయలు అయింది. విశాఖలోని కంచపాలెంకు చెందిన ఓ మహిళ మిడతాన రవికుమార్ తనను పెళ్ళి చేసుకుంటానని మోసగించారని ఆరోపిస్తూ కలకలం రేపింది. దాదాపు పది రోజులక్రితమే ఈ వార్త గుప్పుమన్నా పార్టీ నేతలు కొందరు రాజీ ప్రయత్నాలు చేశారు. కానీ బాధిత మహిళ విజయనగరం రూరల్ పోలీసులను ఆశ్రయించి తనకు న్యాయం చేయాలని కోరింది. కొద్ది రోజులపాటు పోలీసులు నాన్చుడి వైఖరి అవలంబించినా చివరకు కేసు నమోదు చేయాల్సి వచ్చింది. ఈమేరకు శనివారం రూరల్ పోలీసులు మిడతాన రవికుమార్‌పై కేసు నమోదు చేశారు.

నోరుమెదపని జనసేన నేతలు

జిల్లాకు చెందిన ఓ నాయకునిపై ఇటువంటి ఆరోపణలు వస్తే సాధారణంగా తోటి నాయకులు స్పందించడం సాధారణ విషయం. కానీ మిడతానపై ఆరోపణలు వచ్చినా, చివరకు కేసు నమోదు చేసినా ఒక్కరు కూడా స్పందించకపోవడం విశేషం. వాస్తవానికి విజయనగరం నియోజకవర్గం నుంచి కార్పొరేషన్ డైరెక్టర్‌గా మిడతాన రవికుమార్ ఎంపిక పట్ల జిల్లాలోని తోటి నేతలు అసంతృప్తిగా ఉన్నారనే వాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మనకెందుకులే అనే ధోరణిని తోటి నేతలు వెల్లడిస్తున్నారని భోగట్టా.

లోకం మాధవి సమక్షంలో జనసేనలో చేరికలు

విశాలాంధ్ర - భోగాపురం/విజయనగరం: నెల్లిమర్ల శాసనసభ నియోజక వర్గంలోని భోగాపురం మండలానికి చెందిన చెరుకుపల్లి గ్రామంలో రాజకీయ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ఈ గ్రామానికి చెందిన సుమారు 50 కుటుంబాలు, వైసీపీకి గతంలో మద్దతుగా ఉన్నప్పటికీ, ఇప్పుడు జనసేన పార్టీ ఆ విధానాల పట్ల ఆకర్షితులై, స్థానిక ఎమ్మెల్యే లోకం మాధవి నాయకత్వంలో పార్టీలో చేరారు. ఆదివారం ఈ చేరికలను ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు గత వైసీపీ పాలనలో ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. పాలనలో పారదర్శకత లేకపోవడం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో నిర్లక్ష్యం ఉండడం వంటివి తమను కొత్త దిశలో ఆలోచింపజేశాయని తెలిపారు. ఈ సందర్భంగా నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి అందరికీ పార్టీ కండువాలను వేసి ఆహ్వానించారు.

అనంతరం ఆమె మాట్లాడుతూ ఇది కేవలం ఒక చేరిక కాదు, ప్రజల మనసుల్లో చిగురిస్తున్న మార్పుకు సంకేతమన్నారు. జనసేన ప్రజల పార్టీ, అభివృద్ధి పార్టీ అని తెలిపారు. చేరికలో పాల్గొన్న కుటుంబాలు పవన్ కళ్యాణ్ నాయకత్వంపై నమ్మకాన్ని వ్యక్తం చేస్తూ, గ్రామ అభివృద్ధిలో తాము భాగస్వాములవుతామని పేర్కొన్నారు. ఈ పరిణామంతో, గ్రామీణ స్థాయిలో జనసేన పార్టీకి ప్రజల మద్దతు పెరుగుతుండటం, వచ్చే రోజుల్లో రాజకీయ సమీకరణాల్లో కీలకంగా మారే అవకాశాన్ని సూచిస్తోంది.

నీట్ పరీక్షలను ఇన్‌చార్జి కలెక్టర్ తనిఖీ

విశాలాంధ్ర - విజయనగరం: పట్టణంలోని నీట్ పరీక్షా కేంద్రాన్ని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ ఆదివారం పరిశీలించారు. ఆయన జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్షా ఏర్పాట్లు, విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలు, భద్రత, బందోబస్తు తదితర ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, ఎటువంటి తప్పిదాలు జరగకూడదని అధికారులను ఆదేశించారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ వెంట డీఈఓ మాణిక్యం నాయుడు, పరీక్ష కేంద్రం ఇన్‌చార్జి వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు ఉన్నారు.

భరద్వాజను అభినందించిన ఎమ్మెల్యే



విశాలాంధ్ర - రామభద్రపురం: ఇటీవల 10వ తరగతి పరీక్షలలో మండల టాపరుగా నిలిచిన కలిశెట్టి భరద్వాజను ఆదివారం మిర్తివలస గ్రామంలో బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కష్టపడి చదివి గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కొనియాడారు. ఉన్నత చదువుల కోసం తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళల నీకు అందిస్తానని భరోసా ఇచ్చారు. కష్టపడి చదివితే సాధించలేనిది ఏది ఉండదని అన్నారు. అలాగే గ్రామస్తులు మాజీ సర్పంచ్ కోట వెంకటరమణ, సర్పంచ్ మజ్జి రాంబాబు, మజ్జి లక్ష్మీ నాయుడు తదితరులు అభినందించారు.

గ్రంథాలయ వ్యవస్థ బలోపేతమే లక్ష్యం: ఎంపీ కలిశెట్టి

విశాలాంధ్ర - రాజాం: గ్రంథాలయ వ్యవస్థను బలోపేతం చేసే లక్ష్యంతో మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. రాజాం టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేల సహకారంతో జిల్లాలో గల ఏడు నియోజకవర్గాలకు ఒక డిజిటల్ గ్రంథాలయాన్ని ఎంపీ గ్రాంట్ నిధులతో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ సహకారంతో రాజాం నియోజకవర్గం ప్రధాన కేంద్రంలో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు భవనాన్ని త్వరలో పరిశీలిస్తామన్నారు. ప్రతి గ్రంథాలయంలో పత్రికలు, పుస్తకాలు, పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు, కంప్యూటర్లు అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో గురవాన నారాయణరావు, సుమల వెంకట మన్మథరావు, దుప్పల పూడి శ్రీను, టంకాల కన్నం నాయుడు, పిల్లా సత్యం నాయుడు, సిమ్మజగన్నాదం, పొట్నూరు సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో ప్రముఖుల విగ్రహాల ఆవిష్కరణ

విశాలాంధ్ర - బొబ్బిలి: మండలం పక్కి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988-89 పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ

సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, సోదరులు మండల ఎంపీపీ శంబంగి వేణుగోపాలనాయుడు లక్ష్మీ హాజరయ్యారు. ముందుగా పాఠశాలలో నూతనంగా నిర్మించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ, స్వామి వివేకానంద, సరస్వతి దేవి, గౌతమ్ బుద్ధుని విగ్రహాలను మాజీ ఎమ్మెల్యే శంబంగి చేతుల మీదుగా ఆవిష్కరణ చేశారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులు నారాయణమూర్తి, సూరపు నాయుడు, శీర గోపాల్ రావు, రెయ్యి లక్ష్మణరావు, మరియమ్మలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ పక్కి పాఠశాలలో మునుపెన్నడూ లేని విధంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించడం గర్వించదగ్గ విషయమన్నారు. అదేవిధంగా పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు సౌజన్యంతో 2024-25 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గంట పైడిరాజు, విద్య కమిటీ చైర్మన్ శంబంగి గణపతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జివిఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర-జామి: మండలంలోని జాగరం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ దేవత శ్రీముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రాణప్రతిష్టా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్ఛరణ నడుమ విగ్రహాలను ప్రతిష్టించారు. అనంతరం అమ్మవారికి గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేసారు. మహిళలు అమ్మవారికి పసుపుకుంకుంలనలు, చీరలను పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ పెద్దలు రెడ్డిపైడి ఆద్వర్యంలో గ్రామ పెద్దలు, ఆలయ ఉత్సవ నిర్వాహకులు పండగ వాతావరణంలో ఆలయ ప్రతిష్టాకార్యక్రమాలను జరిపించారు. ఆదివారం మద్యాహ్నం భారీ అన్న సంతర్పణ కార్యక్రమం జరిగింది.

ఉచిత నైపుణ్య శిక్షణ, ఉద్యోగ మేళా

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్: స్థానిక వివేకానంద డిగ్రీ కాలేజీలో సీడాప్ ఆధ్వర్యంలో ఉచిత నైపుణ్య శిక్షణ, ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి భరత్, టీడీపీ అధికార ప్రతినిధి గొంప కృష్ణ ప్రముఖ అతిథులుగా పాల్గొన్నారు.

200 మంది యువజనాల్లో 103 మందికి నైపుణ్య శిక్షణ అవకాశాలు కల్పించారు. గొంప కృష్ణ మాట్లాడుతూ యువత నైపుణ్య అభి వృద్ధితోనే సుస్థిర భవిష్యత్తు సాధ్యమన్నారు. కార్య క్రమంలో జిల్లా, మండల టీడీపీ నేతలు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో చేతిరాత నైపుణ్య శిక్షణ

విశాలాంధ్ర - బాడంగి: స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు చేతి రాత నైపుణ శిక్షణ నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి ఆర్.దుర్గా ప్రసాద్ తెలిపారు. పింద్రంగి వలస ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.రవి బాబు ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన తరగతుల నిర్వహణలో భాగంగా చేతి రాతపై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ ఉపాధ్యాయులు కె.నారాయణమూర్తి శిక్షణ ఇచ్చారు. అలాగే 4రూల్ పుస్తకాలను బాడంగి గ్రంథాలయం తరుపున డ్రాయింగ్ మాస్టర్ చేతులు మీదుగా విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో పింద్రంగి వలస ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వైరవి బాబు, బాడంగి గ్రంథాలయాధికారి ఆర్.దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

పెండింగ్ ఈ-చలానాలను చెల్లించాలి

విశాలాంధ్ర - విజయనగరం: వాహనాలపై పెండింగులో ఉన్న ఈ-చలానాలు చెల్లించే వరకు వాహనాలను సీజ్ చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. పెండింగు ఈ-చలానాలను వసూలు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రహదారి భద్రత పట్ల వాహనదారులకు అవగాహన కల్పించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఆదివారం సిబ్బందితో సమావేశమైన ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు తమ పోలీసు స్టేషను పరిధిలో వాహన తనిఖీలు చేపట్టి, ఆయా వాహనాలపై పెండింగులో ఉన్న ఈ-చలానాలను వాహనదారులు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టి, వాహన తనిఖీల్లో వాహనాల రికార్డులను పరిశీలించి, ఆయా వాహనాలపై ఏమైనా పెండింగు ఈ-చలానాలు ఉన్నవి, లేనిది చెక్ చేయాలన్నారు. ఆయా వాహనాలపై ఏమైనా ఈ చలానాలు పెండింగులో ఉన్నట్లయితే, వాటిని వాహనదారులు చెల్లించేంత వరకు ఆయా వాహనాలను సీజ్ చేయాలన్నారు. ఎం.వి. నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై ఈ-చలానాలను విధిస్తున్నప్పటికీ వాహనదారులు వాటిని చెల్లించుటలో నిర్లక్ష్యం వహించడం వలన ఆయా వాహనాలపై ఈ-చలానాలు పెండింగులో ఉండిపోతున్నాయన్నారు. వాహన తనిఖీలు చేపట్టే సమయాల్లో ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. అదే విధంగా ఎం.వి.నిబంధనలను ఉల్లంఘించినా వారిపై ఈ చలానాలను క్రొత్తగా విధించాలని, పెండింగులో ఉన్న చలానాలను చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు.

కార్యకర్తలకు అండగా వైసీపీ: మాజీ మంత్రి బొత్స

విశాలాంధ్ర - మెరకముడిదాం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎల్లప్పుడూ వైసీపీ కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటారని శాసన మండలి ప్రతిపక్ష నేత, రాష్ట్ర మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ భరోసా ఇచ్చారు. ఆదివారం మెరకముడిదాం మండలం చినభంటుపల్లి గ్రామంలో ముఖ్య కార్యాకర్తలు, నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. వైసీపీ నేత కోట్ల వెంకటరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అధికారం లేదని కార్యాకర్తలు, నాయకులు అధైర్య పడాల్సిన అవసరం లేదని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులకు సకాలంలో వేతనాలు, కొత్త పింఛన్లు మంజూరు, రైతులకు వ్యవసాయ విద్యుత్ మీటర్లు తదితరాలు ఏవీ అందడం లేదన్నారు. రెండు, మూడు నెలల్లో పింఛను వచ్చి భర్త చనిపోయిన భార్యలకు పింఛనులు అందుతున్నాయి తప్పా, మిగతా వారికి సంవత్సరం నుండి పింఛన్లు అందలేదని బొత్స దృష్టికి నేతలు తీసుకు వచ్చారు. రైతులకు, ఉపాధి కూలీలకు, వితంతువులకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం అయ్యిందని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, విజయనగరం మాజీ పార్లమెంట్ సభ్యులు బెల్లాన చంద్రశేఖర్, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ఎస్.వెంకటరమణ రాజు, మండల వైసీపీ నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, సత్తారు జగన్మోహన్‌రావు, బూర్లె నరేష్, శివరామకృష్ణ ప్రసాద్, కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యాకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి సంతోష్ కుమార్‌కు పదోన్నతి

విశాలాంధ్ర - నెల్లిమర్ల: నెల్లిమర్ల మండలం ఆత్మారాముని అగ్రహారం పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న సంతోష్ కుమార్‌కు గ్రేడ్ 5 నుండి గ్రేడ్ 4 కార్యదర్శిగా పదోన్నతి లభించింది. పదోన్నతి మీద భోగాపురం మండలం రాజాపులోవ పంచాయితీ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా నెల్లిమర్ల ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు అభినందనలు తెలియజేశారు.

రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని కొండగంగుపూడి పంచాయతీకి శివారు బంగారయ్యపేట, చిట్టివాణిపాలెం గ్రామాల రోడ్డు నిర్మాణానికి శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి ఆదివారం శంకుస్థాపన చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.18లక్షల రూపాయలతో నిర్మించనున్న రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి నిధుల మంజూరు చేయడంతో గ్రామస్తులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి పుణ్యమా అని ఆయా గిరిజన గ్రామాలకు మహర్దశ పట్టిందని అన్నారు. అనంతరం గిరిజనులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా దుస్తులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గలారి బంగారయ్య, మాజీ సర్పంచ్ చల్ల వెంకటరావు, మాజీ ఎంపీటీసీ గనివాడ వెంకటరావు, బూత్ ఇన్‌చార్జ్ ముమ్ములూరి సూర్యనారాయణ, గ్రామ పెద్దలు కన్నాజి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి

విశాలాంధ్ర - విజయనగరం: భగీరథ మహర్షి జయంతి మహోత్సవం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆదివారం ఘనంగా జరిగింది. జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాస మూర్తి ముందుగా భగీరథ మహర్షి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిఆర్వో మాట్లాడుతూ మహనీయుల త్యాగాలను సాధించడమే వారికి నిజమైన నివాళి అని పేర్కొన్నారు. వారి త్యాగాలను గుర్తు చేసుకుని, స్ఫూర్తిని పొందేందుకు ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ వారి అడుగుజాడల్లో నడవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారిణి కె.జ్యోతిశ్రీ, సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ రామారావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి వీటి రామారావు, గృహ నిర్మాణ శాఖాధికారి మురళి, సహాయ మున్సిపల్ కమిషనర్ అప్పలరాజు, ఎబిసిడబ్ల్యువో యశోధనారావు, వసతిగృహ సంక్షేమాధికారులు, సిబ్బంది, వివిధ బీసీ సంఘాల నాయకులు విజయలక్ష్మి, సదనపల్లి రాము, సదనపల్లి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలు

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: గాజులరేగ సంజీవయ్య నగర్‌లో ప్రపంచ మేధావి భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134వ జయంతి ఉత్సవాలు విజయనగర పట్టణంలోని 50 డివిజన్లో ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కర్రోతు వెంకట్ నర్సింగ్ రావు అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ పిల్లలు బాగా చదువుకోవాలని చదువు ఒక్కటే మనల్ని ముందుకు తీసుకెళ్తుంది అని యువత చెడు అలవాట్లకు పడకుండా చదువుతో నైతిక అభివృద్ధి సాధించాలన్నారు. పేదలకు చీరల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 50వ డివిజన్ కార్పొరేటర్ పట్టా ఆదిలక్ష్మి, ఉత్తరాంధ్ర హ్యూమన్ రైట్స్ ప్రధాన కార్యదర్శి జామాన శ్రీనివాస్, మాల మహానాడు పట్టణ అధ్యక్షులు గండిపల్లి సింహాచలం, మాల మహానాడు యువజన విభాగం నాయకులు గండిపల్లి మహేంద్ర బాబు, జిల్లా అంబేద్కర్ రైట్స్ వ్యవస్థాపకులు పాండ్రంకి వెంకటరమణ, మాల మహానాడు నాయకులు దాన రాంబాబు, నాయకులు సియాధులు సంతోష్, గోక విజయ్, పట్టా కనకరాజు, గుర్రపు శంకర్, దీపిల్లి బుజ్జి, రాజు, శ్రీను, గాంధీ, రాజేష్, మోసి పాల్గొన్నారు.

వైసీపీ శవ రాజకీయాలు మానుకోవాలి

జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి విసినిగిరి

విశాలాంధ్ర - చీపురుపల్లి: వైసీపీ శవ రాజకీయాలను మానుకోవాలని జనసేన పార్టీ చీపురుపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు అన్నారు.. ఆదివారం ఆయన స్థానిక జనసేన పార్టీ కార్యాలయం నందు విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. రాష్ట్రంలోని ప్రజలందరికీ మంచి పరిపాలన అందిస్తున్న ఎన్‌డీఏ కూటమి సుపరిపాలనను చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు శవ రాజకీయాలకు తెరలేపారన్నారు. ఇటీవల సింహాచలం దేవాలయ సన్నిధిలో దురదృష్టవశాత్తు గోడ కూలి మరణించిన వారి కుటుంబాలకు సంఘీభావం తెలపడం పోయి, వారి కుటుంబాలకు అండగా ఉండకపోవడం పోయి, అక్కడ కూడా శవ రాజకీయాలకు తెరలేయపారని ఆయన అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ శవాలు లేస్తే ఆ శవాల మీద పేలాలు అమ్ముకునే ఈ వైసీపీ నాయకులకు ఇంకా బుద్ధి రాలేదని విసినిగిరి ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో వైసీపీ అధినేతతో పాటు నాయకులంతా ప్రజా సమస్యలపై పోరాడాలని హితవు పలికారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని ఈ వైసీపీ చోటా, గల్లీ లీడర్లు అందరూ కూడా ప్రజా సమస్యలపై పోరాటం చేస్తే ప్రజలందరీ మద్దతు ఉంటుందని ఇలాంటి చీప్ రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు.

స్పందనలో ఫిర్యాదు చేసినా చర్యలేవి...?

- నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్ పేలుడు పదార్థాల గిడ్డంగి
- కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది
- రెవెన్యూ అధికారుల అండతోనే గిడ్డంగికి అనుమతులు



విశాలాంధ్ర - వేపాడ: కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయని సమస్యలపై స్పందనలో ఫిర్యాదు చేస్తుంటారు. అలాంటి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసిన సమస్యలపై స్పందించక పరిష్కారం కాకపోవడంతో ప్రజల్లో నమ్మకం కోల్పోతున్నారు. మండలంలోని వీలుపర్తి పంచాయతీ శివారు చామలాదేవి అగ్రహారం రెవెన్యూ సర్వే నంబర్ 4లో నిబంధనలకు విరుద్ధంగా గ్రామ సమీపంలో రాతి క్వారీల బ్లాస్టింగ్ పేలుడు పదార్థాల నిల్వ గిడ్డంగికి అనుమతులిచ్చి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని వాపోయారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయడంతో జిల్లా కలెక్టర్ స్పందించి రెవెన్యూ సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోకపోగా జిల్లా కలెక్టర్ ఆదేశాలను బేఖాతర్ చేస్తున్నారని చెప్పక తప్పదు. రెవెన్యూ అధికారులు గిడ్డంగి యజమానితో చేతులు కలిపి వీరి అండదండలతోనే అనుమతులకు సిఫార్సు చేసినట్లు తెలుస్తుంది. కాగా చామలాదేవి అగ్రహారం గ్రామస్తులు స్పందనలో ఫిర్యాదు చేసి 15రోజులు గడుస్తున్నప్పటికీ ఏ ఒక్క అధికారి కూడా దర్యాప్తు చేయలేదు. గ్రామస్తులకు తెలియకుండా

గిడ్డంగి నిర్మాణానికి అనుమతులివ్వడంపై పలు అనుమానాలకు తావిస్తుందని, పంచాయితీలో తీర్మానం చేసిన తరువాత కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందని, అయినా అధికారులు బ్లాస్టింగ్ పదార్థాల గిడ్డంగి యజమానితో కుమ్మక్కై అధికారులు అనుమతులు మంజూరు చేశారన్నారు. చుట్టుపక్కల రైతుల ప్రాణ మానాలతో సంబంధం లేకుండా ఎలా మంజూరు చేస్తారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ గిడ్డంగిలో పేలుడు పదార్థాల నిల్వ స్టోరేజ్ చేస్తే దానివలన జరిగే విస్ఫోటనం (రేడియేషన్) వలన గ్రామస్తులు ఇబ్బందులు పడినా అధికారులకు పట్టదా అని వాపోతున్నారు. ఇప్పటికైనా పేలుడు పదార్థాల నిల్వ గిడ్డంగికి ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని లేకుంటే భారీ ఎత్తున ధర్నాతోపాటు పోరాటానికి గ్రామస్తులందరూ సిద్ధమవుతున్నామని అంటున్నారు.

ఏరులై పారుతున్న మద్యం

విశాలాంధ్ర - చీపురుపల్లి: చీపురుపల్లి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో అక్రమంగా మద్యం ఏరులై పారుతున్నప్పటికీ సంబంధిత యంత్రాంగం ఏం చేస్తుంది అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నిర్వహణ, అక్రమ మద్యం అమ్మకాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు కన్నెత్తి చూడడం లేదంటూ పలువురు ఆరోపిస్తున్నారు. కూటమి పాలనలో బెల్టు షాపుల నిర్వహణకు పూర్తిగా నిషేధిస్తామంటూ పాలకులు ప్రభుత్వం ప్రకటనలు గుప్పించినప్పటికీ ప్రకటనలు కేవలం ఊకదంపుడు ఉపన్యాసాలకే పరిమితం అయ్యే అంటూ పలువురు ఆరోపిస్తున్నారు. కూటమి పాలన ప్రభుత్వం ప్రారంభం నుండే గ్రామాల వారీగా బెల్టు షాపుల నిర్వహణకు అధికారికంగా వేలంపాటలు నిర్వహించి గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులను నిర్వహిస్తున్నారని గ్రామాల వారీగా పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుడి బడి తేడా లేకుండా సమీప ప్రాంతాల్లోనే మద్యాన్ని అమ్మకోలు జరుగుతున్నట్లు స్థానికంగా పలు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అర్ధరాత్రి వేళయినా అత్యవసర మందులు దొరకకపోయినా మద్యం మాత్రం నిత్యవసరం సరఫరా జరుగుతుంది అంటూ దీని కారణంగా తమ జీవితాలు నాశనం అవుతున్నాయంటూ పలు కుటుంబాల మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకించి చీపురుపల్లి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో సిండికేట్ వ్యాపారులు వెచ్చలవిడిగా రాత్రి వేళల్లో మద్యాన్ని సరఫరా చేస్తూ డబ్బులు దండుకుంటున్నారు అంటూ పలు ఆరోపిస్తున్నారు. మద్యం షాపులలో పరిమితిగా మద్యం అమ్మకాలను అధికారికంగా రికార్డు చూపిస్తూ విచ్చలవిడిగా రాత్రి వేళల్లో నచ్చిన షాపులకు మధ్యన్ని సరఫరా చేస్తూ మద్యం షాపుల నిర్వాహకులు యదేచ్ఛగా అక్రమ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎక్సైజ్ అధికారులకు ఇటువంటి అక్రమ వ్యాపారాలు జరగడం పట్ల స్థానికంగా పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో ప్రభుత్వ మద్యం షాపుల ద్వారా ఇటువంటి వ్యాపారాలు కట్టడి అయినప్పటికీ కూటమి ప్రభుత్వం పాలన అనంతరం రాత్రి వేళల్లో మద్యం షాపుల నిర్వాహకులు యదేచిగా బెల్ట్ షాపులకు మధ్యాహ్నా సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణీత ధరల కంటే 50 నుంచి 70 రూపాయల వరకు ఎక్కువ శాతాన్ని అమ్ముకుంటూ అక్రమ మద్యం వ్యాపారులు యదేచ్ఛగా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు కళ్ళు మూసుకుంటూ ఆ వారి వ్యాపారాలకు మద్దతు పలుకుతున్నారంటూ పలువురు ఆరోపిస్తున్నారు. అక్రమ వ్యాపారాల పై సమాచారం ఇవ్వాలి అంటూ ప్రభుత్వం ప్రకటనలు చేస్తున్నప్పటికీ ఆ ప్రకటనలు కేవలం ఊకదంపుడు ప్రకటనగానే మిగిలాయంటూ పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం ఇచ్చిన వ్యక్తులను గోప్యంగా ఉంచాం అంటూ సంబంధిత అధికారులు ప్రకటనలు చేస్తున్నప్పటికీ ఫిర్యాదు చేసిన వ్యక్తుల సమాచారాన్ని యదేచ్ఛగా సంబంధిత అధికారులు అక్రమ వ్యాపారాలకు బట్టబయలు చేస్తూ సమాచారాన్ని అందించడం వలన గ్రామాల వారీగా పలుచోట్ల ఉద్రిక్త వాతావరణం నెలకొంటున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు మీరు పట్టించుకుంటారా స్వచ్ఛందంగా మమ్మల్ని మీ విధులను నిర్వహించమంటారా అంటూ గ్రామాల వారిగా కొంతమంది యువత సిద్ధం కావడం పట్ల చీపురుపల్లి మండలంలో ఎక్సైజ్ సర్కిల్ పరిధిని పలువురు ప్రశ్నిస్తున్నారు. రాజకీయ పార్టీలుగా వేరువేరుగా వారి కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ మద్యం వ్యాపారానికి సంబంధించి అన్ని పార్టీలు ఒకటై సిండికేట్ గా వ్యాపారం కొనసాగిస్తూ ఇటువంటి అక్రమాలకు అయినా అందరం ఒకటే పాల్పడండి అంటూ నినాదం చేయడంతో చీపురుపల్లి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో యదేచ్ఛగా అక్రమ మద్యం వ్యాపారం నిత్యం కొనసాగుతుందంటూ పరువు కుటుంబీకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయాల్లో ఒక దంపుడు ఉపన్యాసాలు ఇచ్చి మా ఓట్లు దొండుకున్న నాయకుల్లారా మా కుటుంబాలకు న్యాయం చేయండి అంటూ పలు కుటుంబాలు నాయకులకు మొరపెట్టుకుంటున్నారు.

శిథిలమైన కల్వర్టులు ప్రజలకు ఇక్కట్లు

విశాలాంధ్ర - వంగర: పెదరాజులగుమ్మడ గ్రామంలో కల్వర్టులు పూర్తిగా శిథిలం కావటంతో ఆ గ్రామస్థులు నడవటానికి హింసలు పడుతున్నారు. నిర్మించిన కల్వర్టులు నెలల్లోనే పలకలు పూర్తిగా విరిగిపోవటం వల్ల ప్రజలు ఆ గ్రామం నుంచి బయటకు అంటే ఇటు పంటపొలాలకు, అటు బయటకు ఎటు వెళ్లాలన్నా పూర్తిగా పాడైన కల్వర్టులు మీదగా వెళ్ళటానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కల్వర్టు ఒక్కటే కాకుండా గ్రామ శివారు మరో కల్వర్టు పరిస్థితి ఇంతకంటే దారుణంగా ఉంది. అనునిత్యం పంటపొలాల్లోకి వెళ్లేందుకు రైతులు, పండినపంటలు గ్రామంలోకి వెళ్లేందుకు నరకం చూస్తున్నారు. పరిస్థితి ఇంత ఘోరంగా ఉన్నా ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవ్వరూ పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. మురుగు కాలువలు కూడా దుర్వాసనతో వెదజల్లుతున్నాయని ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేఎట్టాలని కోరుతున్నారు.

శ్రీ కోదండ రామాలయంలో నేతల పూజలు

విశాలాంధ్ర - మెరకముడిదాం: మెరకముడిదాం మండలం చెల్లాపురం గ్రామంలో గల అతి పురాతన మైన శ్రీ కోదండ రామాలయం పునర్నిర్మాణం కార్యక్రమంలో భాగంగా ఆదివారం జరిగిన ఆలయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు ముఖ్య అతిధిగా హాజరు అయ్యారు. రామ్ మల్లిక్ నాయుడుకు చెల్లాపురంలో టిడిపి నాయకులు, కార్యాకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం రామ్ మల్లిక్ నాయుడు సీతారాములు వారి దర్శనం చేసుకొని వేద పండితులు ఆశీర్వాదం

తీసుకున్నారు. అన్నసమాధాన కార్యక్రమానికి రామ్ మల్లిక్ నాయుడు 20 వేలు రూపాయిలు విరాళంగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కూటమి నాయకులు తాడ్డి సన్యాసినాయుడు, కోట్ల మోతీలాల్ నాయుడు, తాడ్డి చంద్రశేఖర్, రెడ్డి వరం, కెంగువ ధనుంజయ, చల్లా శ్రీరామ్, గరివిడి, చీపురుపల్లి మండలాలకు చెందిన కూటమి నేతలు పాల్గొన్నారు.

అలాగే ఆలయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. చైర్మన్ సీతారాములు వారి దర్శనం చేసుకొని వేద పండితులు ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, మండల అధ్యక్షులు కోట్ల వెంకట్రావు నాయుడు, బూర్లె నరేష్ కుమార్, పల్లె కృష్ణ, కర్రోతు నాగేశ్వరరావు పప్పల కృష్ణ, తదితర నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల ఆలయ ప్రతిష్ట

పాల్గొన్న ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని రామస్వామి పేట గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ సీతారాముల ఆలయ ప్రతిష్ట మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆదివారం వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ యాగాల నిర్వహణతో శ్రీశ్రీశ్రీ సీతారాముల వారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు అందరూ ఈ పూజా కార్యక్రమంలో పాల్గొని శ్రీ సీతారాముల వారి కృపకు పాత్రులయ్యారు. ఈ సందర్భంగా శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి ఈ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు అందుకున్నారు. అలాగే మధ్యాహ్నం 12 గంటల నుండి ఏర్పాటు చేసిన అన్న ప్రసాద కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొని ప్రసాదాల స్వీకరించారు. ఈ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శర్మ, మాజీ సర్పంచులు గోలగాని కృష్ణమూర్తి, పత్రి బాలకృష్ణ, గ్రామ పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు.

వివిధ కార్యక్రమాల్లో జిల్లా పరిషత్ చైర్మన్

విశాలాంధ్ర. - రాజాం: రాజాం టౌన్ సారథి వార్డుకి చెందిన వైసీపీ సీనియర్ నాయకులు దూబ గోపాలం మనుమరాలు ఓనీల వేడుక మహోత్సవంకి హాజరై సాత్వికను విజయనగరం జిల్లా పరిషత్ జడ్పీ చైర్మన్, జిల్లా పార్టీ అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు హాజరై ఆశీర్వదించారు. మాజీ ఎంపీ సభ్యులు బెల్లాన చంద్ర శేఖర్, రాజాం నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇన్చార్జి డా.తలే రాజేష్, మాజీ ఎంఎల్ఏ కంబాల జోగులు, జడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్ మోహన్ రావు, రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు ఈ కార్యక్రమంలో కె.శ్రీనివాసరావు, మోహన్, వంజరాపు విజయకుమార్, డా.బి.నరేంద్ర, మురళి మరియు రాజాం టౌన్ సారథి వైఎస్ఆర్ సీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

వంగర ఘటనకు రాజకీయాలు ఆపాదించొద్దు

డీసీసీబీ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: మన ప్రాంతంలో ఏనాడూ దాడులు, రాజకీయ కక్షలు లేవని.. వ్యక్తిగత అంశాలతో జరిగిన ఘటనకు రాజకీయ రంగు అద్దడం సరికాదని డీసీసీబీ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున తెలిపారు. రాజాం నియోజకవర్గం వంగర మండలంలో కరణం సుదర్శనరావుపై జరిగిన దాడికి రాజకీయాలు ఆపాదించడం సరికాదన్నారు. ఆదివారం విజయనగరంలోని పార్టీ జిల్లా కార్యాలయం అశోక్ బంగ్లాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాగార్జున మాట్లాడారు. వైసీపీ మండల అధ్యక్షుడైన సుదర్శనరావుకు కొంతకాలంగా వ్యాపారపరమైన ఆర్థిక లావాదేవీలు ఉన్నాయని.. ఈ విషయమై వంగర పోలీస్‌స్టేషన్‌లో కూడా కేసు నమోదైనట్లు తెలుస్తోందని చెప్పారు. ప్రశాంతమైన విజయనగరం జిల్లాలో ఈ తరహా దాడులను తాము కూడా తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఇదే సమయంలో జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ వంటివారు అక్కడకు వెళ్లి, ఘటనకు రాజకీయాలను పులమడం చాలా దారుణమన్నారు. ఏదో ఘటనను తీసుకొచ్చి, ఆయన వైకాపా మండల అధ్యక్షుడు కాబట్టి తెదేపా వారే దాడి

చేశారని చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. 'పదవుల్లో ఉన్న వైకాపా నేతలకు ఈ విషయం తెలియదా? ఎవరైనా ఆయన మీద దాడులు చేయాలని చెప్పారా? ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే గ్రామాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో తెలియదా? ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న వంగర మండలంలో వివాదాలు పెంచవద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు బొద్దుల నర్సింగ్‌రావు, ప్రసాదుల ప్రసాద్‌రావు, అల్తి బంగారు బాబు, గొర్లె శ్రీనివాసరావు, మైలపల్లి పైడిరాజు, నడిపల్లి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సద్గురు త్యాగరాజ స్వామి జయంతి

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ విజయనగరం సంయుక్త నిర్వహణలో ఆదివారం కొత్తగ్రహారంలో గల మ్యూజిక్ అకాడమీలో సంగీత త్రిమూర్తులలో ఒకరైన సద్గురు త్యాగరాజ స్వామి 258వ జయంతి ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హైదరాబాద్‌కి చెందిన మోహన్ కుమార్ విచ్చేసి త్యాగరాజ ఘనరాగ పంచరత్న కృతుల గానాన్ని స్థానిక సంగీత విద్వాంసులతో కలిసి ప్రాతినిధ్యం వహించి డాక్టర్ కె.ఎ.పద్మప్రియ, పద్మావతీ శారద, కొత్తపల్లి సుబ్బారావు, గంధం సుజాత, మహేశ్వరరావులతో కలిసి గానం చేశారు. వీణపై కాందూరి వేదవల్లి మంగతాయారు, వయోలిన్ భానుహర్ష, యం.వేణువు వయొలిన్‌పై ప్రముఖ వేణుగాన విద్వాంసులు మోదేకుర్తి వెంకట కామేశ్వరరావు, కె.భానుహర్ష వయోలిన్, అకాడమీ ప్రిన్సిపాల్ మరియు ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి, ప్రముఖ మృదంగ విద్వాంసుడు డాక్టర్ మండపాక రవి మృదంగంపై సహకరించారు. పంచరత్నసేవకుముందు ఎఫ్.ఎఫ్.ఎ అధ్యక్షులు ధవళ సర్వేశ్వరరావు జయంతి ఉత్సవాన్ని ప్రారంభించారు. ఆరవిల్లి విశ్వనాథం, యామిజాల ప్రభు సన్యాసిరావు, కె.గోపీకృష్ణ స్వామి, అసోసియేషన్ సభ్యులు అకాడమీ సభ్యులు విద్యార్థులు, సంగీతాభిమానులు తదితరులు హాజరయ్యారు. సంస్థ లసభ్యులు మోహన్ కుమార్‌ని సత్కరించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

విశాలాంధ్ర - రామభద్రపురం: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక మహిళ మృతి చెందిందని ఏఎస్ఐ ఐవి రమణ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లో ఆదివారం మధ్యాహ్నం ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రం శ్రీరాంనగర్ కాలనీ చందన చనుముల్ల సత్యవతి (64) కూరగాయల వ్యాపారం చేసుకుంటూ జీవిస్తుంది. ఆదివారం తెల్లవారుజాము ఐదు గంటలకు ఆమె ఇంటి వద్ద నుంచి బైపాస్ రోడ్డు కుండా కూరగాయల మార్కెట్‌కు వస్తుండగా కొండ కెంగువ జంక్షన్ వద్ద సాలూరు వైపు నుండి వస్తున్న గుర్తుతెలియని కారు సత్యవతిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె ఘటన స్థలంలోని మృతి చెందింది. మృతదేహాన్ని శవపంచనామా కొరకు బాడంగి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ రమణ తెలిపారు. అలాగే ప్రమాదానికి కారణమైన వాహనం కొరకు గాలింపు చర్యలు చేపడుతున్నామని అన్నారు.